## క్లుప్తంగా

### నేడు ఉచిత వైద్య శిబిరం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో స్థానిక శ్రీభారతి యూపీ స్కూల్ ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ ఎన్. ఉమామణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### రేపు విజిలెన్స్ కమిటీ సమావేశం

మధురపూడి: కోరుకొండ మండల స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం శనివారం జరుగుతుంది. తహసీల్దార్ పాపారావు ఆధ్వర్యంలో కార్యాలయంలోని మీటింగ్ హాల్లో నిర్వహించనున్నారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు హాజరై, ప్రజా పంపిణీ వ్యవస్థ, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల పనితీరు తదితర అంశాలపై చర్చిస్తారు.

### 30న గాయత్రీ హోమం, కార్తిక అన్నసమారాధన

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 30వ తేదీన గాయత్రీ హోమం , అన్నసమారాధన జరగనున్నాయి. రామానందస్వామి దివ్య ఆశీసులతో ఆయన శిష్యపరివార్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 11 యజ్ఞ కుండీలను ఏర్పాటు చేసి, 44 జంటలతో ఉదయం 8.30 గంటల నుంచి గాయత్రీ హోమం నిర్వహిస్తారు. అలాగే ఉదయం 11 గంటల నుంచి ఆలయం పక్కనే ఉన్న మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహిస్తారు. గాయత్రీ హోమంలో పాల్గొనే వారికి ఆలయంలోనే హోమ ద్రవ్యాలను ఉచితంగా అందజేస్తారు.

### వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

గోకవరం: మల్లవరంలో గురువారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం సభ్యులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

### ఘనంగా ఏకాదశి పూజలు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో కార్తిక మాసం ఏకదశి పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఏకదశి పర్వదినం సందర్భంగా మండలంలోని పెదపూడి, జి.మామిడాడ, కరకుదురు, రామేశ్వరం, సంపర, కాండ్రేగుల, పెద్దాడ, పుట్టకొండ, చింతపల్లి, దోమాడ తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారుజామున సమీపంలోని కాలువల్లో పుణ్యస్నానాలు ఆచరించి, ఉపవాసంతో పూజలు చేశారు. కొన్ని ఆలయాల్లో భజన భక్తి మండలిలు సంకీర్తనలు ఆలపించారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు ఆలయాలు విద్యుత్ అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు.

### సత్యసాయిబాబా జయంతి

రంగంపేట: భగవాన్ సత్యసాయి బాబా 98వ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని శ్రీసత్యసాయి సేవా సంస్థల ఈలకొలను, కోటపాడు మందిరాల్లో తెల్లవారుజామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన చేశారు. ఆయా సేవా సమితుల కన్వీనర్లు మల్లిరెడ్డి వీర్రాజు, తిక్కిశెట్టి సుబ్బారావు, కందర్ప వెంకట అమర్‌నాథ్‌లు ప్రశాంతి పతకాలను ఆవిష్కరించారు. మధ్యాహ్నం వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. కోటపాడులో అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సాయి సేవా సదన్ మందిరంలో షిరిడీసాయి, సత్యసాయి, ప్రేమసాయి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

సీతానగరం: స్థానిక సత్యసాయిబాబా మందిరంలో గురువారం సత్యసాయిబాబా జయంతిని సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సాయినామస్మరణతో నగర సంకీర్తన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం ఆరు గంటల నుంచి సాయి భజన కార్యక్రమం నిర్వహించారు.

### కులగణన సర్వే పక్కాగా చేపట్టాలి

పెదపూడి: ఈ నెల 27 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ నిర్వహించే కులగణన సర్వే పక్కాగా చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం రామేశ్వరం గ్రామ సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ అధికారులకు కులగణన సర్వేపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వలంటీర్ యాప్‌లో మొదటి విభాగంలో కుటుంబ వివరాలు, రెండో విభాగంలో సర్వే వివరాలు ఉంటాయన్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరి వేలు ముద్ర తీసుకుని సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొటికలపూడి చినబాబు, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల ఈశ్వర వెంకట సుబ్రహ్మణ్యం, ఈఓ అచ్చిరాజు పాల్గొన్నారు.

**గడువు నాటికి సర్వే పూర్తి చేయాలి**

సీతానగరం: కులగణన సర్వేను గడువు నాటికి పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి గరిమెళ్ల శ్రీనివాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.రమేష్ అధ్యక్షతన గురువారం సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కులగణన సర్వేను ఈనెల 27న ప్రారంభించి, వచ్చే నెల 3 నాటికి పూర్తి చేయాలన్నారు. వలంటీర్లతో కలిసి సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి 20పైగా ఉన్న అంశాలపై సమాచారం సేకరించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి, హౌసింగ్ ఏఈ రామారావు పాల్గొన్నారు

# నేడు నరసింహుని తెప్పోత్సవం

- పూర్తయిన ఏర్పాట్లు
- కోరుకొండలో ఆధ్యాత్మిక శోభ



దేవుని కోనేరులో హంస వాహనం ట్రయిల్ రన్ నిర్వహిస్తున్న సిబ్బంది (అంతర చిత్రం) ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మధురపూడి: కోరుకొండలోని కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి తెప్పోత్సవం శుక్రవారం వైభవంగా జరగనుంది. క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని స్వామి వారి కోనేరులో ఈ మహోత్సవం నిర్వహించనున్నారు. స్వామివారి ఆలయాన్ని దత్తత తీసుకున్న అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ముందుగా స్వామివారిని దేవాలయం నుంచి గిరి ప్రదక్షిణగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో కోనేరుకు తీసుకువెళతారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం హంస వాహనంపై కోనేరులో మూడు సార్లు విహరిస్తారు. అనంతరం గ్రామోత్సతం జరుగుతుంది.

**హంస వాహనం సిద్ధం**

స్వామివారు కోనేరులో విహరించడానికి హంస వాహనాన్ని సిద్ధం చేశారు. దానిని రంగులు, పూలతో సుందరంగా అలకరించారు. అలాగే విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ కాంతుల ధగధగలు.. బాణసంచా కాల్పుల మధ్య అత్యంత వైభవంగా తెప్పోత్సవం జరుగుతుంది. అన్నవరం దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరవుతారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రంగరాజబట్టర్, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు తాడి రజనీరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

# క్షతగాత్రులకు సాయం.. ఎమ్మెల్యే రాజా మానవత్వం

- సొంత వాహనంలో ఆస్పత్రికి తరలింపు
- మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచన



ఘటనా స్థలంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సాయమందించారు. తన సొంత వాహనంలో వారిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులకు స్వయంగా ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. బొబ్బిలంక గ్రామానికి చెందిన కమిడి సత్యనారాయణ, కమిడి లక్ష్మి రాజమహేంద్రవరం నుంచి తమ స్వగ్రామం వెళుతున్నారు. ఊటా సత్యనారాయణ మోటార్ సైకిల్‌పై తొర్రేడు వైపు వస్తున్నారు. కాతేరు దాటిన తరువాత తిరుమల స్కూల్ సమీపంలో వీరి బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కమిడి సత్యనారాయణ, లక్ష్మిలకు స్వల్ప గాయాలు కాగా, ఊటా సత్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో సీతానగరం వైపు వెళుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. క్షతగాత్రులను చూసి చలించిపోయారు. వెంటనే కారు ఆపి కిందికి దిగి స్థానికులను ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు ముగ్గురినీ తన సొంత వాహనంలో గన్‌మన్ సాయంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: అనపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొప్పవరం, లక్ష్మీనరసాపురం, మహేంద్రవాడ గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కుతుకులూరు నుంచి వచ్చే ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మండలంలోని రామవరం, కుతుకులూరు, పొలమూరు గ్రామాల్లో ఇండస్ట్రియల్ లైన్ సప్‌లై నిలుపుదల చేయనున్నామన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



స్వరూపా నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రాజానగరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జక్కంపూడి గణేష్

- తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి
- 'గడప గడపకూ'లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్‌చెరువు శివారు స్వరూపానగర్‌లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలను తెలుసుకుంటూనే గడచిన నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలు, పొందిన ప్రయోజనాలను వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక గడచిన నాలుగున్నరేళ్లలో రూ.1.30 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజల కోరిక మేరకు త్వరలోనే ఇక్కడ ఒక ఓహెచ్‌ఆర్ నిర్మించి, ఇంటింటికీ తాగు నీటిని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా స్వరూపానగర్‌లో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. క్రీడాకారుల అభిరుచి మేరకు షటిల్ కోర్టును కూడా ప్రారంభించారు. రాబోయే ఎన్నికలలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకువస్తే ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఆవాల సతీష్, స్టేట్ హజ్ కమిటీ డైరెక్టర్ హిబద్దుల్లా, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, మెట్ల ఏసుపాదం, ఉమాకాంత్, కొండపల్లి దుర్గారావు, గువ్వల వెంకటేశ్వరరావు, ఆచంట గురునాథ్, పడాల వెంకటేశ్వరరావు, చింతపల్లి శ్రీను పాల్గొన్నారు.

**జగన్‌ను మరోసారి సీఎం చేయాలి**

రాజానగరంలో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అమలు, తీరుతెన్నులపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటూ సమస్యలేమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందుకోవడంలో గానీ, పింఛన్లు పొందడంలో గానీ గత ప్రభుత్వాలలో పడిన ఇబ్బందులను, అగచాట్లను ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో ఇవన్నీ మీ ముంగిటకే ఏవిధంగా వచ్చి చేరాయో, చేరుతున్నాయో తెలుసుకుని, ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్న ప్రభుత్వానికి మరోసారి ఓటు చేయాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, నాయకులు కోలపాటి వెంకన్న, వేమగిరి కృష్ణ, ప్రగడ చక్రి, ఆకుల శ్రీను, సంగీత ప్రసాద్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలి

బిక్కవోలు: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని పందలపాక సచివాలయం-1లో ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సంక్షేమ పథకాల లబ్ధి బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఎంపీటీసీ కర్రి గీతాసావిత్రి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండలంలోని బాలవరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోలి రమణ, మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, ఎంపీటీసీ గోలి వెంకటలక్ష్మి, పార్టీ కన్వీనర్ చెక్కపల్లి నాని పాల్గొన్నారు.



బాలవరంలో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదపూడి: పేదల గుండెల్లో కొలువైన జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడ సచివాలయం-4లో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు వివరాలు తెలిపే బోర్డును ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, కర్రి రామసుబ్బారెడ్డి, నల్లమిల్లి వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: సంక్షేమ పథకాల లబ్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పులుగుర్తలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకరపర్తి వేణు, ఉపసర్పంచ్ భామిరెడ్డి, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పందలపాకలో వలంటీర్లకు బుక్‌లెట్ అందజేస్తున్న రొంగల పద్మావతి



జి.మామిడాడలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు

# జగన్ పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతి జరుగుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ఇనుగంటివారిపేటలో టీడీపీకి చెందిన గాడి రవికుమార్‌తో పాటుగా 70 మంది గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరినీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సాదరంగా ఆహ్వానించారు. ఇనుగంటివారిపేట సర్పంచ్ సత్యం రాంపండు సమక్షంలో వీరందరూ వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ సీతానగరం మండల అభివృద్ధికి అన్ని చర్యలూ చేపడుతున్నామని, నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నామన్నారు. ఎటువంటి అవినీతికి, సిఫారసులకు తావు లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేయించడం ముఖ్యమంత్రి జగన్ పాలన గొప్పతన మన్నారు. అందుకే ప్రజలందరూ ఆకర్షితులవుతున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యం మదన్ బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గల్లి దామోదరం, సాదె చంటిబాబు, కుంచె అచ్యుత రామారావు, మద్దాల కొండలరావు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానం పలుకుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

# పందలపాకలో కార్తిక వనసమారాధన

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, రామతులసి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కార్యకమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, కిలపర్తి సత్యనారాయణ, బొడ్డు ముత్యాలరావు, రొంగల అప్పాజీ, పడాల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

## దళితులంటే మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి చిన్నచూపు

అనపర్తి: మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి దళితులంటే చిన్న చూపని టీడీపీ సీనియర్ నాయకుడు, కాప మాజీ ఉపసర్పంచ్ భర్త నొక్కి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తమ కుటుంబం ఆ పార్టీలోనే కొనసాగుతూ వచ్చామన్నారు. 2014 సాధారణ ఎన్నికల్లో రామకృష్ణారెడ్డికి సీటు రావడానికి, ఆయన విజయానికి తమ వంతు కృషి చేశామని, అటువంటి తమపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వివక్ష చూపుతున్నారన్నారు. తన పదవీకాలంలో రామకృష్ణారెడ్డి టీడీపీ కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వకుండా కేవలం తన సొంత అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారని ఆరోపించారు. గ్రామంలో అక్రమంగా గ్రావెల్ అమ్మకాలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకున్నందుకు సొంత పార్టీ కార్యకర్తలని చూడకుండా తనపై అక్రమ కేసులు బనాయించిన ఘనత మాజీ ఎమ్మెల్యేకే దక్కుతుందని విమర్శించారు. రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా దళితులంతా స్థానిక కెనాల్ రోడ్డులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయదలిస్తే ఆయన 15 మంది దళితులపై అక్రమకేసులు పెట్టించారన్నారు. మాజీ ఎమ్మెల్యే కారణంగా టీడీపీలో దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతానన్నారు.

## కళాశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

సీతానగరం: ఓటు హక్కు పొందిన విద్యార్థులందరూ తప్పనిసరిగా ఓటును వినియోగించుకోవాలని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. గురువారం ఆ కళాశాలలో విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోలింగ్‌పై అవగాహన కల్పించడానికి మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరే రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యను ఆసక్తితో అభ్యసించాలి

రాజానగరం: విద్యను ఆసక్తితో అభ్యసించాలని బెనారస్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ బీఎన్ బసు అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన వేద సొసైటీ సహకారంతో 'వాక్యూమ్ ఎలక్ట్రానిక్స్ పరికరాలు, అప్లికేషన్స్‌లో అభివృద్ధి చెందుతున్న ధోరణులు' అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఇస్రో ద్వారా ఇటీవల లాంచ్ చేసిన చంద్రయాన్ 3, ఆదిత్య ఎల్ 1, నావిక్‌ల గురించి విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.పాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జర్మనీకి చెందిన ప్రొఫెసర్ జాన్ జులనిక్, ఉత్తర కొరియాకు చెందిన ప్రొఫెసర్ గన్ సిక్‌పార్కు వివిధ అంశాల పై ప్రసంగించారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రాజానగరం: జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఆ సమయంలో చెడు అలవాట్లకు పాల్పడితే పతనం తప్పదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జీఎస్ఎల్ వైద్య కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల నిషేధం - ఏపీ ర్యాంగింగ్ నిషేధం చట్టం 1997పై విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. వివిధ చట్టాల గురించి వివరించారు. సమావేశంలో కళాశాల డీన్ డాక్టర్ వైవీ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గురునాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌కె మిశ్రా, ఎస్సై సురేష్, ప్యానల్ లాయర్లు డి.వెంకటేశ్వరరావు, వి.విజయలక్ష్మి, జి.దేవిభవాని, పారాలీగల్ వలంటీర్ కె.పెద్దిరాజు పాల్గొన్నారు.

## మూడు తుపాకులు స్వాధీనం..!

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్టు తెలియవచ్చింది. వారి వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి సమయంలో తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులను తుపాకులతో గుర్తించి అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా ఒక వ్యక్తి పరారయ్యాడు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను రాజమహేంద్రవరం తరలించి విచారిస్తున్నట్టు సమాచారం. దీనిపై అటవీశాఖ అధికారులు ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.

## కొమరిపాలెంలో సినీ ప్రముఖుల సందడి

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో గ్రామంలో బుధవారం రాత్రి సినీ ప్రముఖులు సందడి చేశారు. బింబిసార దర్శకుడు వశిష్ఠ కొమరిపాలెం కమ్యూనిటీ హాలులో జరిగిన తన సోదరుడు శకుంతల రెడ్డి, అన్నితల వివాహానికి హాజరయ్యారు. ఈ వివాహానికి వశిష్ఠతో పాటు డైరెక్టర్ వీవీ వినాయక్, నిర్మాతలు కొడాలి నాని, బన్నీ వాసు, డైరెక్టర్ కర్రి రామారెడ్డి, మల్లిడి సత్యనారాయణరెడ్డి, కలెక్టర్ మాధవీలత హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## షష్ఠి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం



షష్ఠి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులు

అనపర్తి: వచ్చే నెల 18న సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠిని పురస్కరించుకుని స్థానిక వీర్రాజు మామిడి వద్ద గల శ్రీవల్లీదేవసేనా సమేత శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం పందిరి రాట ముహూర్తం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 8న స్వామి వారి మాలధారణ, 16న కావిడి ఉత్సవం, 18న షష్ఠి ఉత్సవం, 19న భారీ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీడీఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ కర్రి సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ బాంధవి దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఓగిరెడ్డి సత్తిరెడ్డి, వెలగల గంగిరెడ్డి, కర్రి సుధాకర్ రెడ్డి, మండ పోతారెడ్డి పాల్గొన్నారు.